క్లుప్తంగా

జ్ఞాపకశక్తిపై అవగాహన



శిక్షణ ఇస్తున్న ట్రైనర్ నరేష్‌కుమార్

ఆమదాలవలస: పురపాలక సంఘం పరిధిలోని 22వ వార్డు లక్కుడుపేటలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో అద్భుత శిక్షణ, అపూర్వ జ్ఞాపకశక్తిపై అంతర్జాతీయ జ్ఞాపకశక్తి ట్రైనర్ బొడ్డేపల్లి నరేష్‌కుమార్ ఆదివారం అవగాహన కల్పించారు. ఆనంద ఫౌండేషన్ వారి సహకారంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యార్థులు జ్ఞాపకశక్తిని ఎలా పెంపొందించుకోవాలో అవగాహన కల్పించారు. చదివే పదాలను, ఆట వస్తువులను గుర్తుంచుకొని ఎలా అవగాహన చేసుకోవాలో అర్థమయ్యే రీతిలో వివరించారు. నరేష్ కుమార్‌ను ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పైడి మనోహర్, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా సాధన చేస్తున్న అధికారులు, క్లబ్ సభ్యులు

పొందూరు: ప్రతి రోజూ యోగా సాధన చేయడంతో ఆరోగ్యంగా ఉండవచ్చని డాక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. ఆయుష్ డిపార్ట్‌మెంట్, జాలీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం యోగాసనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 పట్నాన రాజారావు, జాలీ వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమంగా కంకర తవ్వకాలు



కంకరను ట్రాక్టర్‌లోకి లోడు చేస్తున్న జేసీబీ

సారవకోట: మండలంలోని అవలింగి గ్రామంలోని మంచినీటి కోనేరులో అక్రమంగా యంత్రాలు పెట్టి కంకర తవ్వకాలు సాగిస్తున్నారు. ఈ చెరువులో ఒకపక్క ఉపాధి హామీ పనులు చేపడుతున్నారు. ఆదివారం ఉపాధి పనులకు సెలవు కావడంతో.. కోనేరులో ఉన్న కంకరను అక్రమార్కులు తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. గ్రామంలోని సచివాలయానికి కూతవేటులో ఉన్న చెరువులో తవ్వకాలు సాగిస్తున్నా.. సంబంధిత సిబ్బంది ఏమీ పట్టనట్లు ఉంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై వీఆర్వో గజపతి నారాయణను వివరణ కోరగా.. అక్రమ తవ్వకాలను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. దీనిపై ఇంటలిజెన్స్ సిబ్బంది సైతం ఆరా తీస్తున్నారని అన్నారు.

కేశవరావు మృతదేహాన్ని కుటుంబానికి అప్పగించాలి



మాట్లాడుతున్న పేడాడ జనార్దనరావు

ఆమదాలవలస: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు మృతదేహాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అప్పగించాలని రిటైర్డ్ తహసీల్దార్, కళింగ సంఘ నాయకుడు పేడాడ జనార్దన్‌రావు అన్నారు. ఆదివారం పురపాలక సంఘంలోని రెండో వార్డు కృష్ణాపురంలో మాట్లాడారు. కేశవరావు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు జిల్లా అధికార యంత్రాంగం వెనుకడుగు వేస్తోందని, అధికారుల తీరు సరికాదన్నారు. హైకోర్టుకు వెళ్లి ఆదేశాలు తెచ్చినా అధికారులు మీనమేషాలు లెక్కించడం ఏమిటన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కూన అప్పలనాయుడు ఉన్నారు.

పశుదాణా పంపిణీ



పశుదాణా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: మండల కేంద్రంలోని పాతపట్నం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద రైతులకు పశుదాణాను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశుసంవర్ధశాఖ ఏడీ ఎం.కరుణాకరరావు మాట్లాడుతూ పాడి రైతులకు పశుసంవర్ధకశాఖ ద్వారా పశు దాణాను 50 శాతం సబ్సిడీపై అందజేస్తున్నామన్నారు. మొదటి విడతగా పాతపట్నంలో 157 మంది, మెళియాపుట్టి మండలంలో 157 మంది పాడి రైతులకు దాణా బస్తాలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సారవకోట మండల పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకు ఎం.లోకనాథం, పశు వైద్యులు, నాయకులు పాల్గొన్నారు.



అమృతలింగానగరం వద్ద గోతులమయంగా ఉన్న ఏబీ ప్రధాన రహదారి



బొర్రంపేట వద్ద గోతులమయంగా ఉన్న ఏబీ ఆర్‌అండ్‌బీ రోడ్డు



గొనెపాడు జంక్షన్ వద్ద అధ్వానంగా ఉన్న రహదారి

చక్కటి రోడ్లు.. ఎప్పుడు బాబూ..!



సరుబుజ్జిలి సమీపంలో అలికాం-బత్తిలి ప్రధాన రోడ్డు దుస్థితి ఇలా..

- ప్రధాన, గ్రామీణ రోడ్లకు మోక్షం ఎప్పుడు..
- పెద్ద పండగ పేరుతో చంద్రబాబు పెద్ద మోసం
- గోతుల రోడ్లపై ప్రయాణికుల పాట్లు
- ప్రయాణించాలంటే హడలిపోతున్న జనాలు
- వర్షాకాలం ప్రారంభానికి ముందే బాగుచేయాలి

ఎల్.ఎన్.పేట: జిల్లాలో ప్రధాన రహదారుల్లో ఒకటైన అలికాం–బత్తిలి (ఏబీ) రోడ్డు గోతులమయంగా ఉంది. ప్రధాన రోడ్ల మరమ్మతులు చేపట్టడంలో పాలకులు, అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చూపిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలోని కొత్తూరు కేంద్రంతోపాటు నివగాం, మాతల వెళ్లే రోడ్డు, సరుబుజ్జిలి పోలీసు స్టేషన్ నుంచి ఎల్.ఎన్.పేట మండలం ముంగెన్నపాడు వరకు గోతులుమయంగా ఉన్న ఏబీ రోడ్డును పరిశీలిస్తే తెలుస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై గోతులు మరిన్ని ఎక్కువయ్యాయని ప్రయాణికులు, స్థానికులు చెబుతున్నారు. రోడ్లపై ఉన్న గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయని, ఆయా రోడ్లపై ప్రయాణం చేయాలంటే నరకం చూస్తున్నామని వాహనదారులు, ప్రయాణీకులు ఆందోళన చెందుతున్నారు.

నరకయాతన..

ఏబీ రోడ్డుతోపాటు ఇతర రోడ్లపై చెరువులను తలపించేలా ఉన్న గోతుల్లో ప్రయాణించాలంటే వాహనదారులు, ప్రయాణీకులు హడలిపోతున్నారు. కొత్తూరు–నివగాం, సరుబుజ్జిలి పోలీసు స్టేషన్ నుంచి ముంగెన్నపాడు రోడ్డు వరకు ఉన్న ఆరు కిలో మీటర్ల దూరం ప్రయాణించాలంటే అరగంటకు పైగా సమయం పడుతుంది. గ్రామీణ రోడ్ల పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. అధికారులు, పాలకులు స్పందించి వర్షాకాలం ప్రారంభానికి ముందే రోడ్లను బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.

సంక్రాంతికి రోడ్లు పెద్ద అబద్ధం..

సంక్రాంతి కల్లా చక్కటి రోడ్లు... ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు గతేడాది సెప్టెంబర్ మొదటి వారంలో అనకాపల్లి జిల్లాలో జరిగిన ఒక కార్యక్రమంలో చెప్పిన మాటలు. పెద్ద పండగకు గ్రామాలకు వచ్చే వారికి రెండు నెలల ముందే రోడ్లు బాగుచేస్తామని హామీ ఇచ్చారు. సంక్రాంతి, మహాశివరాత్రి, ఉగాది వంటి పండగలు పోయాయి. మరికొన్ని రోజులు ఆగితే వినాయక చవితితోపాటు అన్ని పండగలు మరలావస్తాయి. జిల్లాలోని ప్రధాన, గ్రామీణ రోడ్లు పరిస్థితిల్లో ఏమాత్రం మార్పు లేదు. చంద్రబాబు వేదికలపై చెప్పే మాటలకు.. వాస్తవాలకు పొంతన ఉండదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

సంక్రాంతి పేరుతో మోసం



మూడు రోజులపాటు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునే సంక్రాంతి పండగ పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మోసం చేశారు. సంక్రాంతికి చక్కటి రోడ్లు వేస్తామని చెప్పారు. సంక్రాంతి పండగ పోయి ఆరు నెలలు అవుతున్నా రోడ్లపై గోతులు కప్పేందుకు దిక్కులేకుండా పోయింది. చంద్రబాబు చెప్పిన మాటలు, ఇచ్చిన హామీలను నమ్మాల్సిన అవసరం లేదు. మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారు.

– శిమ్మ సాంబశివరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, గొట్టిపల్లి, ఎల్.ఎన్.పేట

ఘనంగా శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

పొందూరు: మండలంలోని బురిడికంచరాం గ్రామంలో నిర్వహించనున్న గణపతి–సుబ్రహ్మణ్య సహిత అభయాంజనేయ ఆలయ ప్రతిష్ట మహోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మంది భక్తులు బైక్ ర్యాలీ చేపట్టారు. బురిడికంచరాం నుంచి బయలుదేరి ఎస్.ఎం.పురం, కేశవరావుపేట, శ్రీకాకుళం సింహద్వారం, కింతలి, కనిమెట్ట, దళ్లవలస, రాపాక, పొందూరు, గారపేట, రెడ్డిపేట, లోలుగు, నరసాపురం, అన్నంపేట, చిలకపాలెం, నందివాడ, తదితర గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించారు. ఈ నెల 29, 30, 31 తేదీల్లో ప్రతిష్ట కార్యక్రమాలు, 31న అన్నదానం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద స్వామి, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

100 ఆటోలకు క్యూర్ కోడ్‌ల ఏర్పాటు



ఆటోలకు క్యూర్ కోడ్ స్టిక్కర్లు అంటిస్తున్న ఎస్‌ఐ లావణ్య

పాతపట్నం: మండల కేంద్రంలో తిరుగుతున్న ఆటోలకు క్యూర్ కోడ్ స్టిక్కర్లను అంటించామని ఎస్‌ఐ బి.లావణ్య తెలిపారు. ఆదివారం పాతపట్నంలో 100 ఆటోలకు క్యూర్ కోడ్ స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో ప్రయాణీకులకు భద్రత కల్పించేందుకు, ప్రధానంగా మహిళలు, యువతులు, పిల్లలకు భద్రతాపరంగా మరింత తోడ్పాడు అందించేందేకు, నేర నియంత్రణకు స్టిక్కర్లపై స్కాన్ చేస్తే ఆటోలకు సంబంధించిన సమాచారం ఉంటుందన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అన్ని ఆటోలకు క్యూర్ కోడ్ స్టిక్కర్లు అంటిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ సింహాచలం, పోలీసులు పాల్గొన్నారు.

కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా 'పేడాడ'



నూతన కార్యవర్గం

ఆమదాలవలస: కళాకారుల సంక్షేమ సంఘం ఆమదాలవలస నియోజకవర్గ అధ్యక్షుడిగా పేడాడ ధనుంజయరావు, ప్రధాన కార్యదర్శిగా బగాది తేజేశ్వరరావును సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో సంఘ సమావేశాన్ని టీకి త్రినాథరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. పేద కళాకారులకు గుర్తింపు కార్డులను అందజేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పర్యవేక్షకుడిగా దాస్యం లక్ష్మణరావు వ్యవహరించారు. గౌరవ అధ్యక్షుడిగా టీకు త్రినాథరావు, సహాధ్యక్షుడిగా బొడ్డేపల్లి జనార్దనరావు, కోశాధికారిగా కొంచాడ రామారావు, ఉపాధ్యక్షులుగా దాస్యం లక్ష్మణరావు, ఎస్.చంద్రశేఖరరావు, జి.జోగారావు, పి.వి.ఎస్.మాస్టారు, టి.విశ్వేశ్వరరావు, ఎ.రామాచారి, సంయుక్త కార్యదర్శిగా ఈశ్వరరావు, కార్యదర్శిగా కె.రాములు నాయుడు, కె.సంజీవరావు, పి.డి.కుమార్, ఎన్.వాసుదేవరావు, బి.గోవిందరావు, కె.భాస్కరరావు, కార్యవర్గ సభ్యులుగా పి.గోవిందరావు, ఎల్.విశ్వేశ్వరరావు, బి.గోపాలరావు, పి.రాజులు, బి.దుర్గారావు, సి.హెచ్.ఆదినారాయణ, టి.సత్యనారాయణ, బి.సూర్యనారాయణ, కె.తిరుపతమ్మను ఎన్నుకున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



గేదెల షణ్ముఖరావు (ఫైల్)

సారవకోట: మండలంలోని చీడిపూడి గ్రామానికి చెందిన గేదెల షణ్ముఖరావు (26) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ నెల 10వ తేదీన ద్విచక్ర వాహనంపై అనకాపల్లి వెళ్తుండగా సుభద్రాపురం దగ్గర డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. షణ్ముఖరావును శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. 15 రోజులుగా వైద్యం పొందుతూ మృతి చెందాడు. చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు చిన్నబాబు, రాధమ్మ బోరున విలపించారు.

12 మద్యం బాటిళ్లు స్వాధీనం

పాతపట్నం: మండలంలోని తెంబూరు గ్రామంలో అక్రమంగా మద్యం బాటిళ్లను తీసుకువస్తున్న అదే గ్రామానికి చెందిన నందాన శ్రీనివాసరావు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.లావణ్య తెలిపారు. ఆదివారం సాయంత్రం తెంబూరులోని వై జంక్షన్ కూడలి వద్ద 12 మద్యం బాటిళ్లను తీసుకువస్తుండగా పట్టుకున్నామన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు.

భద్రత గాలికి!



పొన్నాంపేట వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

- కానరాని హెచ్చరిక బోర్డులు
- తరచూ ప్రమాదాలు



మునగవలస వద్ద ప్రమాద సూచికలు లేని మలుపు



సరుబుజ్జిలి సమీపంలో బోల్తా పడిన ఆటో (ఫైల్)

సరుబుజ్జిలి: ప్రతి ఏటా ప్రమాదాలు జరగకుండా ఆర్టీఓలు, పోలీసులు, పలు శాఖల అధికారులు రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ తరచూ రోడ్డుప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. రహదారుల్లో ప్రధానంగా ద్విచక్రవాహనాలు, ఆటోల నడుపుతున్న డ్రైవర్ల వద్ద ఎటువంటి ధ్రువపత్రాలు ఉండడం లేదు. అనుభవంలేని డ్రైవర్లు, మద్యం సేవించి వాహనాలు నడపడం, కొన్ని వాహనాలకు ఎటువంటి ఫిటెనెస్ లేకపోకపోవటం, మితిమీరిన జనాలతో ప్రయాణాలు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

బోర్డులు కరువు..

రహదారుల్లో స్పీడ్‌బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులు లేవు. ముఖ్యంగా మలుపులు, జంక్షన్లు, స్కూల్ జోన్లు, ఇరుకైన బ్రిడ్జీల ఉన్నచోట్ల బోర్డులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. రేడియం స్టిక్కర్ల బోర్డులు లేకపోవడం వలన రాత్రి వేళల్లో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కొత్తగా రహదారుల్లో ప్రయాణాలు చేసేవారు అధికంగా ప్రమాదాలకు గురవుతున్నారు.

వాహనం తీస్తే భయమేస్తుంది



రహదారిపై వాహనం తీస్తే భయమేస్తుంది. ఎవరు ఏ పక్రక్క నుంచి వచ్చి ఢీకొడతారన్న భయంతో వణికిపోతున్నాం. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలాంటి వాటిని అరికట్టాల్సిన బాధ్యత అధికారులు తీసుకోవాలి.

– బి.పూర్ణారావు, ఆటో డ్రైవర్, సరుబుజ్జిలి మండలం

శిక్షలు కఠినంగా ఉండాలి



ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారు ఎంతటి వారైనా కఠినంగా వ్యవహరించాలి. నిబంధనలు ఉల్లంఘించినవారి వాహన లైసెన్స్, రిజిస్ట్రేషన్‌ను రద్దుచేయాలి. శిక్షలు కఠినంగా ఉంటేనే ప్రమాదాలు తగ్గుతాయి.

– పైడి మోహన్‌రావు, మతలబుపేట, సరుబుజ్జిలి మండలం

బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం

రహదారుల్లో రాత్రి వేళల్లో ఇబ్బంది లేకుండా రేడియం బోర్డులు ఏర్పాటుకు చర్యలు తీసుకొంటాం. రద్దీగా ఉన్న జంక్షన్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తాం.

– ఆంజనేయనాయక్, జేఈ, ఆర్‌అండ్‌బీ, సరుబుజ్జిలి

● చెత్త కుండీ కాదు.. మురుగునీటి కాలువ



ఈ చిత్రం నరసన్నపేట పట్టణంలోని నేతాజీ వీధి ఎదురుగా మెయిన్ రోడ్డుకు ఆనుకొని ఉన్న డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త. ఒకవైపు పంచాయతీ సిబ్బంది కాలువలను శుభ్రం చేయడం లేదు. మరోవైపు స్థానిక వ్యాపారులు షాపుల నుంచి వచ్చే వ్యర్థాలు చెత్త కుండీల్లో వేయకుండా డ్రైనేజీలో వేస్తున్నారు. మెయిన్ రోడ్డు అంతటా మురుగు నీటి కాలువలు ఇలాగే కనిపిస్తున్నాయి. పంచాయతీ సిబ్బంది స్పందించి చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు. – నరసన్నపేట

● అడుగుకో గొయ్యి..



ఈ చిత్రం పాతపట్నం మండలంలోని తెంబూరు–బడ్డుమర్రి రహదారి. మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన శిష్టుజగన్నాథపురం, రాజన్నపేట, మద్దుమర్రి, టి.కొత్తూరుకు వెళ్లే ఈ రహదారిలోని గోతులు చెరువులను తలపిస్తున్నాయి. తెంబూరు రైల్వే స్టేషన్ నుంచి బడ్డుమర్రి మీదుగా వెళ్లే మార్గం కొద్దిపాటి వర్షానికే పూర్తిగా అధ్వానంగా తయారైంది. కనీసం నడవడానికి కూడా వీల్లేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి రహదారిని బాగుచేయాలని గిరిజనులు కోరుతున్నారు. – పాతపట్నం

భగవద్గీత పారాయణం చేయాలి



ప్రవచనాలు చెబుతున్న నికేతన్ స్వామి

సారవకోట: ప్రతీ ఒక్కరూ భగవద్గీతా పారాయణం చేయాలని నికేతన్ స్వామి అన్నారు. ఆదివారం మండలంలోని బుడితి గ్రామంలో దివ్య జీవన సమాజం, ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ మానవ దైనందిన జీవితంలో ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకూ భగవద్గీతలో పరిష్కారం దొరుకుతుందన్నారు. అల్లు రామయ్య, రామదాసు, సోమేశ్వరరావు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. భక్తులకు నందాన మహేశ్ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. నిర్వాహకులు మెండ సన్యాసిరావు, జాడ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో భారీ వర్షం



కొత్తూరులో కురుస్తున్న వర్షం

కొత్తూరు: మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. రోడ్లన్ని వర్షం నీటితో నిండిపోయాయి. మండల కేంద్రంలోని కాలేజీ రోడ్డు, పాలకొండ రోడ్డులో ఏర్పడిన గోతుల్లో వర్షంనీరు చేరడంతో చెరువులను తలిపిస్తున్నాయి. దీంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. వర్షానికి ఇటుక బట్టీలు తడిచి కొంతమేర దెబ్బతిన్నాయి.

అపూర్వ సమ్మేళనం



హిరమండలం: 1983-84 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు



కొత్తూరు: 1987-88 బ్యాచ్ విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు

హిరమండలం/కొత్తూరు/సారవకోట/బూర్జ: హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983–84లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం స్థానిక ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1987–88లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సారవకోట మండలంలోని బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవరణలో అదే పాఠశాలలో 1999–2000లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకున్నారు. బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992–93లో చదివిన విద్యార్థులు (స్నేహ మిత్ర బృందం సభ్యులు) అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకున్నారు. రోజంతా సందడిగా గడిపారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు.



సారవకోట: ఒకే వేదికపై కలిసిన 1999-2000 బ్యాచ్ విద్యార్థులు



బూర్జ: 1992-93 పదో తరగతి విద్యార్థులు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొత్తూరు: గ్రామాల్లో లీడ్ ఫార్మర్‌గా గుర్తించిన ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయం చేయడంతోపాటు గ్రామంలో ఉన్న రైతులతో ప్రకృతి వ్యవసాయం సాగు చేయించాలని ప్రకృతి వ్యవసాయం కొత్తూరు సబ్ డివిజన్ ఎంటీ ఎస్.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని బమ్మిడి గ్రామంలో ఆదివారం లీడ్ రైతులను గుర్తించే కార్యక్రమాన్ని నిర్వహించారు. గుర్తించిన రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. నవధాన్యాల సాగుతో భూసారం పెరగడంతోపాటు తేమ ఎక్కువ రోజులు భూమిలో ఉంటుందన్నారు. కలుపు నివారణ సులువుగా చేపట్టవచ్చన్నారు. ఆరోగ్యవంతమైన పంటలు పండించవచ్చన్నారు. గ్రామానికి చెందిన లీడ్ ఫార్మర్ రోగాలు సంతోష్‌కు చెందిన ఎకరం పొలంలో వనధాన్యాల సాగును ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయం సిబ్బంది రవి, బాలకృష్ణ, చిన్నా, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కరించాలి



భూ హక్కు పత్రాలు చూపిస్తున్న గిరిజన రైతులు

హిరమండలం: మండలంలోని గులుమూరు పంచాయతీ జగన్నాథపురంలోని గిరిజనుల భూ సమస్యను పరిష్కరించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం జగన్నాథపురంలో గిరిజన రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. గిరిజనులకు సంబంధించిన భూములను గిరిజనేతరులు ఆక్రమించుకున్నారన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఇప్పటి వరకు ఈ సమస్యను పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైనా తహసీల్దార్ జోక్యం చేసుకోవాలని, భూ హక్కు పత్రాలు కలిగిన గిరిజనులకు భూమిని అప్పగించాలన్నారు. లేకుంటే తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఊలక భవానీ, రుగడ నర్సయ్య, ఆదిలక్ష్మి, భీముడు, చిన్నమ్మి, రామయ్య, సీఐటీయూ నాయకుడు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆమదాలవలస/ పాతపట్నం: 9010177724, 7075499517
నరసన్నపేట: 9912220367
Office mail : sklmadvt@gmail.com